సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 15 । జనవరి । 2024



పండుగ పూట.. ఆత్మీయ ఆట

భోగి పండుగను పురస్కరించుకొని ఆదివారం మాజీ క్రికెట్ క్రీడాకారులు క్రికెట్ మ్యాచ్ ఆడి చిన్ననాటి స్నేహంలోని మాధుర్యాన్ని ఆస్వాదించారు. -IIలో



ముగ్గురు దొంగలు అరెస్టు

వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.250
రెండోరకం	రూ.100	రూ.176

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 134 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	370	470
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 484.360 కిలోలు

సంతోషాల క్రాంతి.. సంక్రాంతి



పీలేరు: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నెహ్రూబజార్‌లో భోగి మంటలు



కడపలో రంగవల్లుల ముందు చిన్నారుల సంక్రాంతి సందడి

- భోగిమంటల సందళ్లు
- ముంగిళ్లలో రంగవల్లులు
- ఊరూవాడా పండగ సందడి

పీలేరు/పుల్లంపేట/కడప కల్చరల్: ఏడాదిగా ఎదురుచూస్తున్న పెద్ద పండుగ సంక్రాంతి రానే వచ్చింది. ప్రకృతి పరవశించే సమయంలో.... పంటలు దండిగా ఇంటికి చేరతాయన్న ధీమాతో రైతన్న కులాసాగా ఉన్న సమయంలో ఆశల ప్రతి రూపంగా అందరి ఇంట ఆనందాలు నెలకొనేలా కొత్త కాంతి వచ్చింది. జిల్లా వాసులు ఈ పండుగను ఘనంగా స్వాగతించారు. భోగిమంటలు, భోగి స్నానాలు ప్రతి ఇంటి ప్రాంగణంలో మెరిసే రంగవల్లులు, గంగిరెద్దుల సందళ్లు, హరిదాసుల సంకీర్తనలు, బంధువులతో ఇళ్లు కళకళలాడాయి. ఆదివారం భోగి పండుగతో సంక్రాంతి సందడి ప్రారంభమైంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో తెల్లవారుజామున 4 గంటల నుంచే వీధులు మేల్కొన్నాయి. వీధుల్లో, రోడ్ల కూడళ్లలో ప్రజలు పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు. పలుచోట్ల అర్ధరాత్రి నుంచే స్థానిక యువకుల ఆధ్వర్యంలో భారీగా భోగి మంటలు వెలిగాయి. ఇళ్లలో ఉన్న పాత సామగ్రి, వీధుల్లోని చెత్తాచెదారం కూడా భోగిమంటల్లోకి చేరింది. ప్రత్యేకించి యువకులు, పిల్లలు ఉత్సాహ భరితంగా భోగి మంటలు వేసుకున్నారు. మరికొందరు పండుగను స్వాగతిస్తూ బాణాసంచా పేల్చి ఆనందించారు. యువకులు ద్విచక్ర వాహనాలపై వీధుల్లో వేగంగా వెళుతూ 'హ్యాపీ సంక్రాంతి' అంటూ తమదైనశైలిలో శుభాకాంక్షలు తెలుపుతూ ఉత్సాహాన్ని ప్రదర్శించారు.

సంప్రదాయబద్ధంగా

ఉదయాన్నే పెద్దలు పిల్లలకు రేగుపండ్లతో ప్రత్యేకంగా భోగి స్నానాలు చేయించారు. పలుచోట్ల ఇళ్లలో గౌరీమాత పూజలు నిర్వహించారు. ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్దారు. కొందరు అర్ధరాత్రి సమయానికే ముగ్గులు వేయడం పూర్తి చేయగా, మరికొందరు తెల్లవారుజామున 4 గంటల నుంచి రంగవల్లులు తీర్చారు. ముగ్గుల మధ్య గొబ్బెమ్మను ఉంచి పూలతో అలంకరించారు. చిన్నారులు, పెద్దలు పోటీలుపడి గాలిపటాలను ఎగుర వేసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలను ప్రోత్సహిస్తూ పలుచోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పలు కుటుంబాల్లో సంప్రదాయంగా పొంగళ్లు పెట్టుకుని పూజలు చేశారు. మరికొన్నిచోట్ల దోసెలను ఆరగించారు. విదేశాల్లో, పెద్ద నగరాల్లో స్థిరపడిన వారు, ఉద్యోగాలు చేస్తున్న వారు తరలి రావడంతో కొన్ని ఇళ్లల్లో బంధువుల సందడి కనిపించింది . ఉన్నంతలో సంప్రదాయాలను పాటిస్తూ సంక్రాంతిలో తొలిరోజు పండుగ భోగిని ఘనంగా నిర్వహించుకుని సంక్రాంతి లక్ష్మికి ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం మకర సంక్రాంతి పేరిట పెద్దల పండుగను నిర్వహించేందుకు ఏర్పాట్ల హడావుడిలో మునిగిపోయారు.



పుల్లంపేట: ముగ్గు తీర్చిదిద్దుతున్న మహిళ

రద్దీ తగ్గలేదు

పెద్ద పండుగను సొంత ఊళ్లలో, సొంత ఇళ్లలో నిర్వహించుకునేందుకు పెద్ద నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు కుటుంబాలతో ఆదివారం కూడా తమ ఇళ్లకు చేరుకున్నారు. దీంతో ఉదయం కడపలోని ఆర్టీసీ బస్టాండు, ఏడురోడ్ల కూడలి వద్ద పెద్ద ఎత్తున జనసందడి నెలకొంది. ముందే రిజర్వు కావడంతో టిక్కెట్టుపై ఎక్కువ డబ్బు చెల్లించి వచ్చామని పలువురు పేర్కొన్నారు. ప్రైవేటు బస్సుల హడావుడి ఎక్కువగా కనిపించింది. ప్రత్యేకంగా ఆర్టీసీ స్పెషల్ బస్సులను నడపడంతో రవాణాకు సంబంధించిన సమస్యలు తలెత్తలేదు.

సంక్రాంతి శుభాకాంక్షలు

రాయచోటి టౌన్: ప్రజలు ఆనందంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందరి సహకారంతో జిల్లా మరింత అభివృద్ధి దిశగా ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. అలాగే జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, శాసన సభ వ్యవహారాల సమన్వయ కర్త, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి, శాసన మండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానం, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీ మిధున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజలకు శుభాకాంక్షలు తెలియచేశారు.

కమ్మేసిన పొగమంచు



పొగమంచు కమ్మేయడంతో రోడ్డుపై లైట్లు వేసుకుని వాహనాలు నడుపుతున్న దృశ్యం

గుర్రంకొండ పట్టణాన్ని ఆదివారం ఉదయం పొగమంచు కమ్మేసింది. పట్టణంతో పాటు ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారిపై కూడా పొగమంచు దృశ్యాలు కనువిందు చేశాయి. ఉదయం 8.30గంటల వరకు పొగమంచులో వాహనాలు కనబడక లైట్లు వేసుకొంటూ ముందుకు సాగడం గమనార్హం. ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారి పై పొగమంచు ఊటీని తలపించింది. వాహనాదారులు వాహనాలు నిలిపి పొగమంచు దృశ్యాలను తిలకించారు. పలువురు ఈ దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించారు. -గుర్రంకొండ

న్యూస్‌రీల్

నేడు వైఎస్‌ఆర్ జిల్లాకు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

కడప కార్పొరేషన్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్ ఈ నెల 15, 16 వ తేదీల్లో జిల్లా లో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లా నుంచి ఈ నెల 15వ తేదీ సోమవారం రాత్రి 7.30 గంటలకు బయలు దేరి రాత్రి 10.30 గంటలకు కడప ఆర్ అండ్‌బి అతిథి గృహానికి చేరుకుని బస చేస్తారని, 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ప్రెస్ మీట్ నిర్వహిస్తారన్నారు. అనంతరం బాపట్ల జిల్లా అద్దంకి కి బయలుదేరి వెళ్తారని కలెక్టర్ తెలిపారు.

జిల్లా ఆస్పత్రిలో ఉద్యోగాలకు దరఖాస్తుల వెల్లువ



ఉద్యోగాలకు దరఖాస్తు చేసేందుకు వచ్చిన అభ్యర్థులు

మదనపల్లె: మదనపల్లె మెడికల్ కళాశాల, స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో తాత్కాలిక, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 267 ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్న ప్రకటన మేరకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆదివారం మెడికల్ కళాశాల ఇన్‌చార్జ్ మురళీధర్ మీడియాతో మాట్లాడుతూ... 33 విభాగాలకు సంబంధించి మెడికల్ కళాశాలలో 65, జిల్లా ఆస్పత్రిలో 202 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. ఈనెల 9 నుంచి 14 వరకు పూర్తిచేసిన దరఖాస్తులను జిల్లా ఆస్పత్రిలో అందజేయాలని కోరితే... గడువు ముగిసే సమయానికి అన్ని విభాగాలకు సంబంధించి 5,750 దరఖాస్తులు అందాయన్నారు. వీటిని ఎస్వీ మెడికల్ కాలేజి తిరుపతికి పంపి, రూల్ ఆఫ్ రిజర్వేషన్ కింద ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబానికి చేదోడుగా నిలవాలన్నారు. దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించేందుకు సంక్రాంతి సందర్భంగా రంగవల్లుల పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కమనీయం.. గోదా కల్యాణం



తాళిని చూపుతున్న వేద పండితుడు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వల్లూరు: పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో భోగి పండుగను పురస్కరించుకుని ఆదివారం శ్రీ గోదాదేవి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా శ్రీ మహా విష్ణువు అంశ అయిన శ్రీ చెన్న కేశవ స్వామి , శ్రీ మహా లక్ష్మి అంశ అయిన గోదాదేవికి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. మొదట రక్షా సూత్రధారణ, కణ్యావరుణ విశేషార్చన కార్యక్రమాలను జరిపారు. అనంతరం వైభవోపేతంగా మాంగల్య ధారణ కార్యక్రమాన్ని చూసిన భక్తులు ఆనందపరవశులయ్యారు. చివరగా మాలికా పరివర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా కొండ ప్రాంగణం గోవిందనామ స్మరణతో మార్మోగింది. కాగా తెల్లవారు జామున ధనుర్మాస ప్రాతఃకాల పూజను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త వెంకట సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి ఈవో శ్రీనివాసులు, పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

- ఈ సందర్భంగా వేద పండితులు గోదా కల్యాణ ప్రాశస్త్యం గురించి భక్తులకు వివరించారు. శ్రీమహాలక్ష్మి అంశగా జన్మించిన విష్ణు చిత్తుని కుమార్తె అయిన గోదాదేవి మహా విష్ణువైన రంగనాథున్ని ప్రతి రోజూ పూల మాలతో అలంకరించి పూజించేది. తాను కూర్చిన పూల మాలను మొదట తానే ధరించి అది బాగుందని తలచిన తర్వాతే స్వామివారికి అలంకరించి భక్తితో పూజించేది. గోదాదేవి కలలో స్వామి వారిని భర్తగా కోరుకోగా , ఇలలో కల్యాణం జరిగింది. శ్రీ మహాలక్ష్మి స్వర్గలోకం నుంచి భూలోకంలో కాలిడిన రోజు భోగి పండుగ రోజని, అందుకే ఈ రోజు జరిగే గోదా కల్యాణోత్సవాన్ని చూసిన వారికి సిరి సంపదలు, ఆయురారోగ్యాలు సమ కూరుతాయని, పెళ్లి కాని యువతకు వివాహాలు జరుగుతాయని పురాణాలు వెల్లడిస్తున్నాయి.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్: సంక్రాంతి వేడుకల్లో భాగంగా దివంగత ఆకేపాటి లక్ష్మిరెడ్డి, అనసూయమ్మల జ్ఞాపకార్థం ఆకేపాటి ఎస్టేట్‌లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అన్నమయ్య జిల్లా రాజంపేటలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. కర్నూలు, అనంతపురం, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఎద్దు పాల్గొన్నాయి. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పోటీలను ప్రారంభించారు. ఉత్సాహంగా సాగిన ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆకేపాటి తిలకించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి బహుమతులు అందించారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు టౌన్‌కు చెందిన కుర్రా వెంకటేష్ యాదవ్ ఎడ్లకు ప్రథమ బహుమతిగా రూ.60 వేలు, వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం గోసులవారిపల్లికి చెందిన పామిరెడ్డి వెంకటరమణారెడ్డి ఎడ్లకు ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు, వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మూలే ప్రసాద్‌రెడ్డి ఎడ్లకు తృతీయ బహుమతిగా రూ.40 వేలు, వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మూలే సూరారెడ్డి ఎడ్లకు నాలుగో బహుమతిగా రూ. 30వేలు, వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం జంగంపల్లికి చెందిన పుత్తా నాగసుబ్బారెడ్డికి చెందిన ఎడ్లకు అయిదో బహుమతిగా రూ.20 వేలు, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మోడిమాకలపల్లికి చెందిన తోట తిరుపాల్‌రెడ్డి ఎడ్లకు ఆరో బహుమతిగా రూ.10 వేలు, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు టౌన్ వసంతపేటకు చెందిన ద్వార్శల చంద్రోశేఖర్‌రెడ్డి, కల్లూరుకు చెందిన పగడాల నాగేష్ ఎడ్లకు సంయుక్తంగా ఏడో బహుమతిగా రూ.5వేలు, వైఎస్సార్ జిల్లా వీఎన్ పల్లి మండలం తలపనూరుకు చెందిన శంభురెడ్డి, బాలపెద్దిరెడ్డి ఎడ్లకు ఎనిమిదో బహుమతిగా రూ. 3వేలు అందించారు. అనంతరం ఆకేపాటి మాట్లాడుతూ ప్రజలందరూ సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గాలి వీటి మదన్‌రెడ్డి, సుండుపల్లి మాజీ ఎంపీపీ యర్రబాపు అజంతమ్మ, నాయకులు చొప్పా యల్లారెడ్డి, రేణింతల చిన్నపరెడ్డి, నాగా పృథ్వీపతిరెడ్డి, కుందానెల్లూరు గోపిరెడ్డి, అజయరెడ్డి, ఏబీ మహేష్‌రెడ్డి, గడికోట సుబ్బారెడ్డి, ఎస్ జావీద్‌అలీ, పోలీ మురళీరెడ్డి, పాపినేని విశ్వనాథరెడ్డి, దాసరి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

బంగారు నగలు చోరీ

గంటల వ్యవధిలో నిందితుడి పట్టివేత

కలికిరి : బంగారు నగలు చోరీ జరిగిన గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితుడిని పట్టుకున్న సంఘటన కలికిరి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పత్తేగడ గ్రామం కొటాలలో నివాసముండే సంకు శంకరమ్మ శనివారం రాత్రి ఇంటి తాళం వేసి అదే గ్రామంలో ఉండే కుమార్తె ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం తిరిగి ఇంటికి వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో చూడగా బీరువాలో ఉంచిన 10 గ్రాముల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు పీలేరు మండలం కోటపల్లికి చెందిన షేక్ బావాజీ అలియాస్ బాబును నిందితుడుగా గుర్తించి మేడికుర్తి–సారకాయలపేట క్రాస్ వద్ద అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు. గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్న ఏఎస్ఐ మధుసూదనాచారి, హెచ్‌సీ మనోహర, కానిస్టేబుల్ చైతన్యను ఎస్ఐ రహీముల్లా, సీఐ సురేష్ కుమార్ అభినందించారు.


బంగారు నగలు చోరీ నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

పండుగ పూట.. ఆత్మీయ ఆట

- మాజీ క్రీడాకారులను ఒకచోటికి చేర్చుతున్న సంక్రాంతి
- ఏడాదికోసారి క్రికెట్ మ్యాచ్‌తో సందడి చేస్తున్న క్రీడాకారులు


పూర్వ క్రికెట్ క్రీడా మిత్రులు

రాజంపేట టౌన్ : సంక్రాంతి సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాల పేరిట చిన్ననాటి మిత్రులు కలుసుకుంటుండటం ఇప్పుడు సర్వసాధారణమైంది. అయితే క్రికెట్ క్రీడ వల్ల పరిచయమైన చిన్ననాటి స్నేహితులు చిన్నప్పుడు వారు క్రికెట్ ఆడిన క్రీడామైదానంలోనే గత నాలుగు సంవత్సరాలుగా సంక్రాంతి సందర్భంగా సరదాగా క్రికెట్ ఆడి అలనాటి తీపి గుర్తులను నెమరు వేసుకుంటున్నారు. ఈ ఏడాది కూడా భోగి పండుగను పురస్కరించుకొని ఆదివారం మాజీ క్రికెట్ క్రీడాకారులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో క్రికెట్ మ్యాచ్ ఆడి చిన్ననాటి స్నేహంలోని మాధుర్యాన్ని ఆస్వాదించారు. ఈ మ్యాచ్‌లో ఒక జట్టుకు వడ్డే రమణ కెప్టెన్‌గా వ్యవహరించగా మరో జట్టుకు షేక్ అబ్దుల్లా కెప్టెన్‌గా వ్యవహరించారు. తొలుత బ్యాటింగ్ చేసిన వడ్డే రమణ జట్టు నిర్ణీత పది ఓవర్లకు 84 పరుగులు చేయగా, అబ్దుల్లా జట్టు 85 పరుగులు చేసి విజయం సాధించింది. కాగా ఈ క్రికెట్ మ్యాచ్‌కు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వారే కాక విదేశాల్లో ఉన్న మాజీ క్రికెట్ ప్లేయర్స్ కూడా రావడం విశేషం. నాలుగున్నర దశాబ్దాల క్రితం రాజంపేట క్రికెట్ క్లబ్ (ఆర్‌సీసీ) ఏర్పాటై రాయలసీమలోనే ప్రసిద్ధి గాంచిన క్రికెట్ జట్టుగా గుర్తింపు పొందింది. దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు ఆర్‌సీసీ ద్వారా అనేక మంది క్రికెట్ ప్లేయర్స్‌గా తయారై రాష్ట్ర స్థాయిలో సైతం అనేక విజయాలు సాధించి రాజంపేటకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. అయితే ఆర్‌సీసీలోని క్రీడాకారులు కొంత మందికి ఉద్యోగ అవకాశాలు రావడం, మరికొంత మంది వివిధ వృత్తుల్లో, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. వీరిలో అనేక మంది ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. అయితే ఐదు సంవత్సరాల క్రితం కొంతమంది క్రీడాకారులు ఎక్కడెక్కడో ఉంటున్న చిన్ననాటి క్రీడామిత్రులను కలుసుకోవడం కోసం చేసిన ప్రయత్నంతో ఆర్‌సీసీ ప్లేయర్స్ వాట్సాప్ వేదికగా ఒకటయ్యారు. అనంతరం గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి ఏడాది భోగి పండుగ రోజున ఆర్‌సీసీ మాజీ క్రీడాకారులు కలిసి క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం వేదికవుతుంది. మాజీ క్రికెట్ క్రీడాకారుల్లో పలువురు ఆరు పదుల వయస్సుపైబడిన వారు ఉండగా అనేక మంది ఐదు పదుల వయస్సు పైబడినవారు ఉండటం విశేషం.

మనసు పులకించింది



నేను అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాను. చిన్నప్పుడు ఆర్‌సీసీ వల్లే క్రికెట్ ప్లేయర్ అయ్యాను. నాలుగు సంవత్సరాలుగా ఆర్‌సీసీలోని ప్లేయర్స్ సంక్రాంతి సందర్భంగా కలుస్తున్నారు. అయితే నాకు వీలు కుదరలేదు. ఈసారి ఎలాగైనా చిన్ననాటి స్నేహితులను కలవాలని వచ్చాను. చిన్ననాటి స్నేహితులను కలవడంతో మనసు పులకించింది.

వీఎల్‌వీ.ప్రసాద్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అమెరికా

ఏడాదికి సరిపడే ఆనందం



ఏడాదికి ఒకసారి ఆర్‌సీసీలోని ప్లేయర్స్‌ని కలిసి సరదాగా గడిపే అవకాశం వస్తుండటం నిజంగా ఎంతో ఆనందంగా ఉంది. సంక్రాంతి సందర్భంగా చిన్ననాటి క్రీడా మిత్రులతో మ్యాచ్ ఆడే సమయం కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తుంటాను. మిత్రులతో కలిసి సరదాగా మ్యాచ్ ఆడటం వల్ల ఏడాదికి సరిపడే ఆనందాన్ని పొందుతాను.

దేవానంద్, సూపరింటెండెంట్, రైల్వేశాఖ, తిరుపతి



వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. బడుల రూపు రేఖలు మారాయి. పలు రకాల ధ్రువీకరణ పత్రాలు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. –సాక్షి నెట్‌వర్క్

కార్పొరేట్‌కు దీటుగా పాఠశాల



మా పాఠశాల కార్పొరేట్‌కు దీటుగా మారింది. నాడు–నేడు కింద పాఠశాల ఎంపికైంది. దీంతో పాఠశాల చుట్టూ ప్రహరీ, పాఠశాల భవనాలు అందంగా నిర్మించారు. విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందించారు. జగనన్న గోరుముద్దతో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నాం. ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసింది. గతం కంటే ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగాయి.

–గిరిధర్, టీచర్, జెడ్పీహెచ్ఎస్, సీటీఎం, మదనపల్లె మండలం

సులభతరంగా ధ్రువపత్రాలు



గత ప్రభుత్వంలో ఏవైనా ధ్రువపత్రాలు కావాలంటే మీ సేవలో దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టూ, మీసేవల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. అయినా సకాలంలో ధ్రువపత్రాలు అందేవికావు. చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారం. అయితే జగనన్న సురక్ష కార్యక్రమం పెట్టడంతో మా పిల్లలకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు కావాలని గ్రామ వలంటీరుకు తెలిపాము. ఒక్కరోజులోనే మా ఇంటి వద్దకు ధ్రువపత్రాలు తెచ్చి ఇచ్చారు.

– జి. ప్రమీలమ్మ, బోదుమల్లువారిపల్లె, పీలేరు మండలం


విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం


విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవుతున్న పూరిగుడిసె

ఓబులవారిపల్లె : నూకనపల్లి ఎస్టీ కాలనీ గ్రామంలో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వెలుగు నరసింహులుకు చెందిన పూరిగుడిసె దగ్ధమైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసెలో మంటలు చెలరేగాయి. చుట్టు పక్కల వారు గమనించి మంటలు అదుపు చేశారు. రూ. 10 వేలు నగదు, దుస్తులు, గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. రూ.లక్ష మేర ఆస్తినష్టం వాటిల్లింది.

ముగ్గురు దొంగలు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

రూ.33లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, ఒక కారు స్వాధీనం

రాయచోటి టౌన్ : వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అన్నమయ్య జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.33 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని రాయచోటి, రైల్వేకోడూరు. చిన్నమండెం, మదనపల్లె, చిట్వేలి, సంబేపల్లె పోలీసు స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాలలో దొంగతనాలు జరిగినట్లు అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాయచోటి – మదనపల్లె రోడ్డులోని రింగ్ రోడ్డులో ఏజీ గార్డెన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ముగ్గురు నిందితులు ఏపీ03 ఏసీ 7107 అనే నంబర్ గల మారుతీ సుజికి కారులో అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వీరు ముగ్గురు వివిధ దోపిడీ కేసుల్లో నిందితులని తేలిందని చెప్పారు. వారి నుంచి 523.65 గ్రాముల బంగారు ఆభరణాలు, 1545 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీటి విలువ సుమారు రూ.33 లక్షలు ఉంటుందని అంచనా వేశామన్నారు. పట్టుబడిన వారిలో చిత్తూరు జిల్లా పంజని గ్రామానికి చెందిన కృష్ణప్ప రాజేష్ (21), పలమనేరు మండలానికి చెందిన తలారి హేమగిరి (47), మదనపల్లెకు చెందిన ఆవుల ప్రసాద్ (38) గా గుర్తించినట్లు తెలిపారు. రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, రూరల్ సీఐ తులసీరాం మదనపల్లె సీఐ శేఖర్, కలికిరి ఎస్ఐ రహీముల్లాలతో పాటు కానిస్టేబుళ్లు కె.బర్కతుల్లా, ఏ.మహేంద్ర నాయుడు, ఏ.శివరాజేంద్ర, టి.జగన్నాథ, యు.శ్రీనివాసులు, జి. శివశంకర్‌లను అభినందించారు.

గాయపడిన యువతి మృతి

పెద్దతిప్పసముద్రం : ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సానియా (18) మృతి చెందింది. బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

బెంగళూరులో చోరీ.. కలికిరిలో రికవరీ

- పోలీసుల అదుపులో ద్విచక్రవాహనాల దొంగ
- 17 ద్విచక్రవాహనాలు స్వాధీనం


కలికిరి పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ద్విచక్రవాహనాలు

కలికిరి : కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నార్త్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన ద్విచక్రవాహనాలు కలికిరిలో ఉన్నట్లు కర్ణాటక పోలీసులు గుర్తించారు. దీంతో వారు వాటిని ఆదివారం కలికిరికి వచ్చి స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... బెంగళూరుకు చెందిన ద్విచక్రవాహనాల చోరీ ముఠా అక్కడ ద్విచక్రవాహనాలు చోరీ చేసి కలికిరి, చుట్టుపక్కల ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు కర్ణాటక పోలీసులు గుర్తించారు. కూపీ లాగి పెద్ద ఎత్తున వాహనాలు రికవరీ చేశారు. కలికిరి పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఫయాజ్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. బెంగళూరుకు చెందిన ద్విచక్రవాహనాల చోరీ ముఠాతో సంబంధాలు కలిగి అక్కడ చోరీ చేసిన వాహనాలను ఇక్కడ విక్రయించేవాడు. వాహనాలు చౌకగా విక్రయిస్తుండటంతో చాలా మంది కొనుగోలు చేశారు. కర్ణాటకలో నిందితులను పట్టుకున్న పోలీసులు వాహనాల రికవరీలో భాగంగా ముందుగా ఫయాజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించి, వాహనాలను రికవరీ చేశారు. స్థానిక పోలీసుల సహకారంతో కలికిరి మండల పరిధిలోనే 17 ద్విచక్రవాహనాలను గుర్తించి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉంచారు. కలికిరితో పాటు కలకడ, కేవీపల్లి, పీలేరు ప్రాంతాల్లో మొత్తం 45 ద్విచక్రవాహనాలను రికవరీ చేసినట్లు బెంగళూరు నార్త్ పోలీసులు తెలిపారు. నిందితులను అక్కడ అరెస్టు చూపనున్నట్లు తెలిపారు. చోరీ వాహనాల సమాచారం కలికిరిలో చర్చనీయాంశంగా మారింది.

ప్రమాదవశాత్తు మంటలో పడి రైతు మృతి


మంటల్లో కాలి చనిపోయిన చెన్నారెడ్డి

మదనపల్లె : మడి నాటేందుకు సేకరించిన చెత్తను తగలబెడుతూ, ప్రమాదవశాత్తు అందులో పడి రైతు తీవ్రంగా కాలిపోయి మృతి చెందిన ఘటన మండలంలోని పోతపోలు పంచాయతీ కొంకిరెడ్డిపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన కె.చెన్నారెడ్డికి భార్య గంగులమ్మ, కుమారుడు సురేంద్రరెడ్డి, కుమార్తె ఉన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో చెన్నారెడ్డి వరి మడి నాటేందుకు పొలాన్ని చదునుచేసే క్రమంలో చెత్తను ఒకచోట కుప్పగా పోగు చేశాడు. కుప్ప తగులబెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడ్డాడు. వయోభారంతో లేవలేక మంటల్లోనే కాలిపోయాడు. గుర్తించిన స్థానికులు అతడిని మంటల నుంచి బయటకు తీసేలోపు మృతి చెందాడు. సంక్రాంతి పండుగ వేళ రైతు అగ్నికి ఆహుతి కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

వ్యక్తిపై కత్తితో దాడి


గాయపడిన గజేంద్ర

సంబేపల్లె : మండలంలోని నారాయణరెడ్డిపల్లెకు చెందిన గజేంద్రనాయుడుపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కత్తితో దాడి చేశారు. దీంతో గాయపడిన వ్యక్తిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ దాడికి సంబంధించిన వివరాలు తెలియాల్సిఉంది.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని ఆదివారం అరెస్టు చేసి రూ. 16,060 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ–2 వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.